## ప్రభుత్వ బడికి చేయూత



అత్తాపూర్ ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి కోసం విరాళం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

మైలార్‌దేవ్‌పల్లి, జూన్ 3: తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధి కోసం తమవంతు సహాయం చేసేందుకు పూర్వవిద్యార్థులు ముందుకు వచ్చారు. అత్తాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2000–01 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న విద్యార్థులు పాఠశాల అభివృద్ధి కోసం రూ. 16 వేలు ప్రధానోపాధ్యాయురాలు శ్రీలతకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్‌సాగర్, న్యాయవాది హరిదాస్, వెంకటరెడ్డి, బాలమని, శ్రీశైలం, శ్రీకాంత్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## డిగ్రీ రెండో సెమిస్టరు పరీక్ష ఫలితాలు విడుదల



పరీక్ష ఫలితాలు విడుదల చేస్తున్న శశికాంత్

హిమాయత్‌నగర్,జూన్ 3: నారాయణగూడలోని బాబూ జగ్జీవన్ రామ్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ (స్వయం ప్రతిపత్తి) రెండో సెమిస్టర్ తుది ఫలితాలు ఉస్మానియ విశ్వవిద్యాలయ పరీక్షల నిర్వహణ అధికారి ప్రొఫెసర్ కె. శశికాంత్ విడుదల చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.విజయ్‌కుమార్,కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామ్స్ డాక్టర్ బాలస్వామి మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. విద్యార్థులు కాలేజీ వెబ్‌సైట్‌లో పరీక్షా ఫలితాలను తెలుసుకోవచ్చున్నారు. తుదిపరీక్షా ఫలితాల్లో బీ.కామ్ విద్యార్థులు విజయ ఢంకా మోగించారు.మొదటి సంవత్సరంలోనే మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

### వివిధ కోర్సుల పరీక్ష ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఈడీ, ఎల్ఎల్ఎం, డేటా సైన్స్ కోర్సు పరీక్ష ఫలితాలతో పాటు ఎంఈ, ఎంటెక్ కోర్సుల మొదటి సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్ష ఫలితాలను విడుదల చేశామన్నారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

## భూ సమస్యల పరిష్కారం కోసమే ‘రెవెన్యూ సదస్సు’లు

### జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రతిమాసింగ్

మణికొండ, జూన్ 3 : భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని జాయింట్ కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని ఖానాపూర్ గ్రామ రైతు వేదికలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను ఆమె పరిశీలించారు. ప్రధానంగా ప్రొహిబిటెడ్, విరాసత్, మిస్సింగ్ సర్వే నంబర్లపై దరఖాస్తులు అందాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు శ్రీనివాస్‌రెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సురేష్, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేష్,నార్సింగి ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ కృష్ణ, మాజీ కౌన్సిలర్ అమరేందర్‌రెడ్డి, సహకార సంఘం డైరెక్టర్లు రామకృష్ణారెడ్డి, రైతులు పాల్గొన్నారు.



ఖానాపూర్‌లో రెవెన్యూ సదస్సులో పాల్గొన్న జాయింట్ కలెక్టర్ ప్రతిమాసింగ్, తహసీల్దారు శ్రీనివాస్‌రెడ్డి, పాల్గొన్న ప్రజాప్రతినిధులు

**● సమాచారం లేదని రైతుల ఆందోళన**

బండ్లగూడ: తెలంగాణ ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన భూభారతి కార్యక్రమంలో భాగంగా రాజేంద్రనగర్, గండిపేట్ మండలాల పరిధిలోని పలు గ్రామాల్లో రెవెన్యూ అధికారులు రైతు సదస్సు సభలను నిర్వహించారు.

- కిస్మత్పూర్, ఉప్పరపల్లి గ్రామాల్లో నిర్వహించిన రైతు సదస్సులో రైతులు అనేక ఫిర్యాదులు చేశారు.
- కిస్మత్పూర్ గ్రామంలో భూముల సమస్యలపై 20 దరఖాస్తులు వచ్చినట్లుగా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సుజిత్ రెడ్డి తెలిపారు.
- రాజేంద్రనగర్ మండలం పరిధిలోని ఉప్పరపల్లి లో నిర్వహించిన రైతు సదస్సులో ఎలాంటి ఫిర్యాదులు అందలేదని అధికారులు తెలిపారు.
- ఇదిలా ఉంటే సమాచారం లేకుండా రైతు సదస్సులను ఏర్పాటు చేయడం పట్ల రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ముందస్తుగా సమాచారం ఇచ్చి ఉంటే బాగుండేదని వారు అభిప్రాయపడ్డారు.



రైతుల నుంచి దరఖాస్తులను తీసుకుంటున్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సుజిత్‌రెడ్డి

### భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు

**శంషాబాద్ తహసీల్దార్ రవీందర్ దత్**

శంషాబాద్ రూరల్: భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు శంషాబాద్ తహసీల్దార్ రవీందర్ దత్ తెలిపారు. మంగళవారం శంషాబాద్ మండలంలోని ముచ్చింతల్ గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పలువురు రైతులు వారికి ఉన్న భూ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. దీంతో పాటు మ్యుటేషన్, విరాసత్ డిఎస్ పెండింగ్, ఆధార్‌లింకు, పీవోటీ తదితర సమస్యలపై విన్నవించారు. రైతులకు రెవెన్యూశాఖ అధికారులు దాదాపు ఈ నెల 19 వరకు గ్రామాల్లో ఉంటారని వారి భూ సమస్యలు తమ దృష్టికి తీసుకొస్తే వాటిని సాధ్యమైనంత మేరకు పరిష్కారం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ కృష్ణ,పలువురు రెవెన్యూ సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు. మరో టీమ్ మండలంలోని జూకల్ గ్రామంలో నిర్వహించిన సదస్సులో పాల్గొని రైతుల సమస్యల పరిష్కారం కోసం అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.



ముచ్చింతల్ గ్రామంలో నిర్వహించిన సదస్సులో రైతుల సమస్యలు వింటున్న తహసీల్దార్ రవీందర్‌దత్

## నాలాలో పూడిక తీయండి

బండ్లగూడ, జూన్ 3: వర్షాకాలం సమీపిస్తుండడంతో అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని ఇంజినీరింగ్ విభాగం అధికారులను రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ ఉప కమిషనర్ రవికుమార్ ఆదేశించారు. రానున్న వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు చర్యలు తీసుకునేందుకు మంగళవారం ఇంజినీరింగ్ విభాగం అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ రవికుమార్ మాట్లాడుతూ రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని మైలార్‌దేవ్‌పల్లి , రాజేంద్రనగర్, శాస్త్రిపురం, సులేమాన్ నగర్, అత్తాపూర్ డివిజన్లో పరిధిలో ఎక్కడ కూడా వర్షాల వల్ల ప్రజలకు ఇబ్బందులు రాకుండా చర్యలు చేపట్టాలన్నారు. నాలాల పూడిక తీయడం, వర్షపు నీటి నిల్వలు లేకుండా చేయడం, అందుకు కావాల్సిన చర్యలు చేపట్టడం వంటి పనులను పూర్తి చేయాలన్నారు. ఇందుకోసం మాన్సూన్ సిబ్బందిని కూడా సిద్ధం చేసుకోవాలని ఆయన సూచించారు.



ఇంజినీరింగ్ విభాగం అధికారులతో చర్చిస్తున్న రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ రవికుమార్



**ఉచిత వైద్య శిబిరం:** ఎర్రగడ్డలోని కేంద్ర ప్రభుత్వ యునానీ చికిత్సాలయం ఆధ్వర్యంలో మంగళవారం బోరబండలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మొబైల్ హెల్త్ కేర్ ప్రోగ్రాంలో భాగంగా సాయిబాబా నగర్‌లో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని ఆ పరిసర ప్రాంతాల వాళ్ళు సద్వినియోగం చేసుకున్నారు. యునానీ దవాఖానకు చెందిన రీసెర్చ్ అధికారి డాక్టర్ రాజారామ్, సిబ్బంది షాహీన్ బేగం, అబ్రార్ అహ్మద్ తదితరులు పాల్గొని పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. – ఎర్రగడ్డ

## దేవరకొండబస్తీలో సమస్యలు పరిష్కరించాలి



దేవరకొండబస్తీలో సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి , డీఎంసీ సమ్మయ్య తదితరులు

బంజారాహిల్స్, జూన్ 3 : వెంకటేశ్వరకాలనీ డివిజన్ పరిధిలోని దేవరకొండబస్తీలో సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి తెలిపారు. దానిలో భాగంగా జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ప్రీ మాన్సూన్ శానిటేషన్ డ్రైవ్‌ను మంగళవారం కార్పొరేటర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా బస్తీలో పర్యటించిన కార్పొరేటర్‌కు స్థానికులు సమస్యలపై ఫిర్యాదులు అందజేశారు. పంజాగుట్ట శ్మశానవాటిక వెనకాల దేవరకొండబస్తీ వైపు రోడ్డును వేయాలని, అపరిశుభ్రంగా ఉన్న పరిసరాలను శుభ్రం చేయాలని స్థానికులు కోరారు. దీంతో పాటు బస్తీలోని హనుమాన్ ఆలయం వద్ద నాలా నిర్మాణానికి రెండేళ్ల క్రితమే నిధులు మంజూరు చేయగా ఇప్పటివరకు పనులు ప్రారంభం కాలేదని స్థానికులు ఫిర్యాదు చేశారు. వెంటనే పనులు ప్రారంభించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని డీఎంసీ సమ్మయ్యను కార్పొరేటర్ కోరారు.



### మాజీమంత్రి,ఎమ్మెల్యే హరీశ్‌రావు పుట్టినరోజు సందర్భంగా..

రాష్ట్ర మాజీ మంత్రి,సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు పుట్టినరోజు సందర్భంగా మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు సంబురాలు జరుపుకున్నారు. అల్కాపూర్ టౌన్‌షిప్ ప్రధాన రహదారి బట్టర్ ఫ్లై సర్కిల్(చింతచెట్టు కూడలి) వద్ద పార్టీ అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ నేతృత్వంలో హరీశ్‌రావు పుట్టినరోజు వేడుకలను పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి సంబురాలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గుట్టమీది నరేందర్, దన్‌రాజ్, ఉపేంద్రనాథ్‌రెడ్డి, అందె లక్ష్మణ్‌రావు,శ్రీకాంత్,మాల్యాద్రి నాయుడు, ఆరీఫ్, శ్రీకాంత్,బాబురావు, సుమళిని తదితరులు పాల్గొన్నారు. – మణికొండ,జూన్ 3

## డిగ్రీ కోర్సుల ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని వివిధ డిగ్రీ కోర్సుల పరీక్ష ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు అధికారులు తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ, బీఎస్సీ ఆనర్స్, బీబీఏ, బీఎస్‌డబ్ల్యూ కోర్సుల నాలుగు, ఆరో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్ష ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని, ఫలితాలను తమ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. మార్కుల మెమోలను సంబంధిత కళాశాల నుంచి మూడు వారాల తర్వాత పొందవచ్చని పేర్కొన్నారు. ఈ ఫలితాల రీవాల్యుయేషన్‌కు ఒక్కో పేపర్‌కు రూ.500 చొప్పున చెల్లించి ఈ నెల 9లోగా, రూ.200 అపరాధ రుసుంతో 11 వరకు టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. జవాబు పత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్‌కు రూ. 1000 చొప్పున చెల్లించి ఈ నెల 11వరకు తమ కార్యాలయంలో చెల్లించాలని పేర్కొన్నారు.

## ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత



హిమాయత్ నగర్‌లోని టీటీడీలో జరిగిన బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని ఆశీర్వదిస్తున్న అర్చకులు

హిమాయత్ నగర్ ,జూన్ 3: ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తోందని కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. హిమాయత్ నగర్ , లిబర్టీలోని తిరుని లయంలో శ్రీ వేంకటేశ్వరస్వామి 20వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం సకల దేవతలను ఆహ్వానిస్తూ ధ్వజా రోహణం ఘట్టం వైభవంగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్చరణలు, మంగళ వాయిద్యాలు, భక్తుల గోవింద నామస్మరణతో మారు మోగింది. ఈ ఉత్సవాలకు కిషన్ రెడ్డి హాజరై మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలు లేకుండా పాడి పంటలతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని స్వామి వారిని కోరుకున్నట్లు తెలిపారు. లోకకల్యాణం కోసం ఈ ఉత్సవాలు జరుగుతున్నాయని, భక్తులు అధిక సంఖ్యల్లో పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొందాలని కోరారు. శేష వాహనంపై పద్మావతి గోదాదేవి సమేత శ్రీవారి ఊరేగింపు, హనుమంత వాహనంపై శ్రీవారి ఊరేగింపు జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, టీటీడీ ఉపకార్యనిర్వహణ అధికారి రమేష్, దాత వై. టీవీ. త్రినాథ్ బాబు , ప్రతినిధులు శ్రీనివాస్ ప్రభు, హరికృష్ణ కోరారు.



### సంగీతంలో తండ్రీకూతురికి వరల్డ్ రికార్డ్ గుర్తింపు

బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అరుణోదయ నగర్ కాలనీకి చెందిన దాసరి సురేష్ బాబు, అతడి కుమార్తె దాసరి రియా రోస్లిన్ లు సంగీతంపై ఆసక్తి కనబరిచి హాలెల్ మ్యూజిక్ స్కూల్ డైరెక్టర్ అగస్టిన్ దండింగి ప్రోత్సాహంతో వారు గిన్నిస్ రికార్డు సాధించారు. సురేష్ ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ కంపెనీలో సీనియర్ మేనేజర్‌గా పని చేస్తుండగా.. రియా డాన్ బాస్కో స్కూల్‌లో 4వ తరగతి చదువుతోంది. ఆన్‌లైన్ కీబోర్డ్ మెలోడీలో వారు ప్రావీణ్యం సాధించి పోటీలో పాల్గొన్న పోటీలో 18 దేశాల నుంచి 1046 మంది పాల్గొన్నట్లు సురేష్ తెలిపారు. దీంతో వీరి ప్రతిభను గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ అధికారి రిచర్డ్ స్టెన్నింగ్ గిన్నిస్ వరల్డ్ రికార్డ్‌గా గుర్తించారు.దీంతో బండగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ ఆల్ కాలనీస్ ఫెడరేషన్ వారి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌ను కలువగా వారిని ఎమ్మెల్యే శాలువాతో సత్కరించి అభినందించారు.ఈ కార్యక్రమంలో ఆల్ కాలనీ ఫెడరేషన్ సభ్యులు వినయ్ రెడ్డి, నరేంద్ర బాబు, ప్రసాద్ రెడ్డి, విజయ్ పద్మనాభన్ పాల్గొన్నారు.
– బండ్లగూడ, జూన్ 3

## బీఈ కోర్సుల వన్ టైం చాన్స్ పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని అన్ని విభాగాల బీఈ కోర్సులు పూర్తిచేసి బ్యాక్‌లాగ్ సబ్జెక్టులు మిగిలిపోయిన వారికి వన్ టైమ్ చాన్స్ కల్పించినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఓయూ అకాడమిక్ సెనేట్ స్టాండింగ్ కమిటీ అనుమతించిందని చెప్పారు. 2000 ఏడాది తరువాత ఆయా కోర్సుల్లో చేరినవారు సైతం తమ బ్యాక్‌లాగ్ పరీక్షలకు హాజరయ్యేందుకు అవకాశమిచ్చామన్నారు. ఈ కోర్సుల అన్ని సెమిస్టర్ల పరీక్ష ఫీజును ఈ నెల 13వ తేదీలోగా, రూ.200 అపరాధ రుసుముతో కలిపి 17వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని సూచించారు. అన్ని కోర్సుల పరీక్షలకు సాధారణ పరీక్ష ఫీజుతో పాటు పెనాల్టీ చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న సిలబస్, పరీక్ష విధానంలోనే వారు పరీక్షలకు హాజరుకావాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ పరీక్షలను వచ్చే నెలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే ప్రకటిస్తామన్నారు.

## విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు



రవీందర్ విద్యుత్ అసిస్టెంట్ ఇంజినీర్

మైలార్‌దేవ్‌పల్లి, జూన్ 3: విద్యుత్ సమస్యలు తలెత్తకుండా వినియోగదారులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని గగన్‌పహాడ్ విద్యుత్ అసిస్టెంట్ ఇంజినీర్ రవీందర్ తెలిపారు. మంగళవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజేంద్రనగర్, గగన్‌పహాడ్ విద్యుత్ సెక్షన్‌ల పరిధిలో వివిధ సమస్యలపై కొత్త ఫోన్ నెంబర్‌కు కాల్ చేసి సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. సెక్షన్ పరిధిలోని గగన్‌పహాడ్, శాతంరాయి, పాశంబండ, బుద్వేల్ రైల్వే స్టేషన్, వెంకటేశ్వర కాలనీ, నేతాజీనగర్, పద్మశాలిపురం, ఇందిరాగాంధీ హౌసింగ్ సొసైటీ, ఆప్కో కాలనీ, మధుర కాలనీకి చెందిన విద్యుత్ వినియోగదారులు సమస్యలు ఉంటే ఎఫ్ఓసీ 24 గంటలు ఈ నెంబర్ 8712470104 అందుబాటులో ఉంటుందన్నారు. సిబ్బంది ఫిర్యాదులు చేసిన వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

## ప్రజల సమస్యను పరిష్కరించాలి

మైలార్‌దేవ్‌పల్లి, జూన్ 3: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం తనవంతు బాధ్యతగా కృషి చేయడం జరుగుతుందని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గోదా పాండుయాదవ్ ఆధ్వర్యంలో శివరాంపల్లి రైల్వే స్టేషన్ ప్రాంతంలో మూడు సంవత్సరాల క్రితం మెయిటెనెన్స్ వర్క్ పేరుతో రైల్వే డిపార్ట్‌మెంట్ రోడ్డును మూసి వేసి అడ్డంగా గోడను నిర్మించారన్నారు. దీని కారణంగా స్థానిక ప్రజలు పడుతున్న ఇబ్బందులను వినతిపత్రం ద్వారా ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ రోడ్డు 40 సంవత్సరాలుగా బాబుల్‌రెడ్డినగర్, కాటేదాన్, మైలార్‌దేవ్‌పల్లి, సాయిబాబానగర్, బృందావన్ కాలనీ, ఆదర్శనగర్, మోహన్‌రెడ్డినగర్, ప్రగతి కాలనీ తదితర ప్రాంతాల ప్రజలు ఉపయోగించేవారన్నారు.స్కూల్, కాలేజీలకు వెళ్తున్న విద్యార్థులకు సైతం ఇబ్బందులు తప్పడం లేదన్నారు. ఈ సందర్భంగా తోకల శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ వీలైనంత త్వరగా సమస్య తీర్చే విధంగా చూస్తానన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటరమణ, సంతుగౌడ్, రావుల భాస్కర్, బొమ్మ రాజునర్సింహ్మ, మధుసూధన్ రెడ్డి, గోపాల్‌నాయక్, కిషన్, కురుమయ్య, శంకర్, చింటురెడ్డి, కిరణ్, శేఖర్ పాల్గొన్నారు.

## పలువురి విద్యార్థులకు .. బంగారు పతకాలు





ఎంజీఐటీ విద్యార్థిని పన్నీటి శ్రీజకు బంగారు పతకాన్ని అందజేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌శర్మ





మహవీర్ కళాశాల విద్యార్థి లకావత్ కోమలికకు బంగారు పతకాన్ని అందజేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌శర్మ

### ఎంజీఐటీ విద్యార్థులకు బంగారు పతకాలు

మణికొండ, జూన్ 3 : 2020–2024 బ్యాచ్‌కు చెందిన ఐదుగురు మహాత్మాగాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంజీఐటీ) విద్యార్థులు మంగళవారం జరిగిన జేఎన్టీయూహెచ్ స్నాతకోత్సవ వేడుకలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ చేతులమీదుగా ఐదు బంగారు పతకాలను అందుకున్నారు.

- బీటెక్ సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో అన్ని అనుబంధ కళాశాలలో ఉత్తమ అవుట్‌గోయింగ్ విద్యార్థినిగా పన్నటి శ్రీజ అందుకున్నారు.
- బీటెక్ మెకానికల్ ఇంజినీరింగ్ (మెకాట్రానిక్స్) విభాగంలో అన్ని అనుబంధ కళాశాలలలో ఉత్తమ అవుట్‌గోయింగ్ విద్యార్థి గొట్టిపర్తి అభినయ్ అందుకున్నారు.
- బీటెక్ మెటలర్జికల్,మెటీరియల్స్ ఇంజినీరింగ్ విభాగంలో అన్ని అనుబంధ కళాశాలలలో ఉత్తమ అవుట్‌గోయింగ్ విద్యార్థిని మెడగం నిఖితా రెడ్డి అందుకున్నారు.
- బీటెక్ కంప్యూటర్ సైన్స్ , బిజినెస్ సిస్టమ్స్ విభాగంలో అన్ని అనుబంధ కళాశాలలలో ఉత్తమ అవుట్‌గోయింగ్ విద్యార్థిని కె సాయి భారతి అందుకున్నారు.
- బీటెక్ కంప్యూటర్ సైన్స్ ,ఇంజినీరింగ్ (డేటా సైన్స్) విభాగంలో అన్ని అనుబంధ కళాశాలలలో ఉత్తమ అవుట్‌గోయింగ్ విద్యార్థిని పి ఆయేషా ఖానం బంగారు పతకాలు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ జి చంద్రమోహన్ రెడ్డి తెలిపారు.

ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్,కళాశాల సిబ్బంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు.

### మహవీర్ కళాశాల విద్యార్థినికి బంగారు పతకం

మైలార్‌దేవ్‌పల్లి: మహవీర్ కళాశాలకు చెందిన విద్యార్థిని లకావత్ కోమలికకు గవర్నర్ జిష్ణుదేవ్‌శర్మ బంగారు పతకాన్ని అందజేశారు. లకావత్ కోమలిక బీటెక్ ఏరోనాటికల్‌లో 2023–24 సంవత్సరానికి గాను ఈ పతకాన్ని సాధించింది. ఈ సందర్భంగా మంగళవారం మహవీర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల కార్యదర్శి సంరెడ్డి సురేందర్‌రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నైపుణ్యతతో కూడిన ఉత్తమ విద్యాబోధన అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వి.ఉషశ్రీ, కళాశాల చైర్మన్ ఎస్.జయలక్ష్మి, జాయింట్ సెక్రటరీ సంరెడ్డి ధనుంజయ్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

## ఐదేండ్లలోపు పిల్లలను అంగన్‌వాడీలకు పంపాలి

హిమాయత్ నగర్, జూన్ 3: అంగన్‌వాడీ కేంద్రాలకు 5 ఏండ్ల లోపు పిల్లలను పంపించే విధంగా ప్రభుత్వ చర్యలు చేపట్టాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందూరి కరుణ కుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్లకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ లక్ష నుంచి 2 లక్షలకు, హెల్పర్స్‌కు రూ. 50 వేల నుంచి లక్షకు పెంచడం , 60 ఏండ్లు దాటిన వారికి అనారోగ్యం, ఇతర కారణాల వల్ల వలంటరీ రిటైర్మెంట్ తీసుకునే అవకాశం, ఆసరా పెన్షన్ సౌకర్యం కల్పిస్తూ జీవో నంబర్ 8ని విడుదల చేయడాన్ని స్వాగతిస్తున్నామన్నారు.
ఈ జీవోలో 2024 జూలై 1 నుంచి వర్తింప చేస్తామని ఇచ్చిన హామీలను ఈ జీఓలో పొందు పరచకపోవడం వల్ల రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్‌కు అన్యాయం జరుగుతుందన్నారు. ఆసరా పెన్షన్ కాకుండా ఉద్యోగులకు ఇచ్చే పెన్షన్ సౌకర్యం కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలపై పోలీసులు పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



### క్రికెట్ టోర్నమెంట్ విజేతకు కప్ అందజేత

శంషాబాద్ మండలంలోని పెద్దతూప్ర గ్రామంలో క్రికెట్ టోర్నమెట్ కీర్తి శేషులు సూర్యనాయక్ నేజీబాయి జ్ఞాపకార్థం వారి కుమారుడు కేతావత్ శ్రీనునాయక్ గ్రామంలోని యువతకు టోర్నమెట్ నిర్వహించారు. మంగళవారం టోర్నమెంట్ ముగియడంతో గెలుపొందిన వారికి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ మాట్లాడుతూ యువత ఆటలపోటీలలో పాల్గొని అందరితో స్నేహభావం ఏర్పాటు చేసుకోని ముందుకు పొగాలని సూచించారు. విజేతగా నిలిచిన టీమ్‌కు 11వేల నగదుతో పాటు బహుమతి, ద్వితీయస్థానంలో నిలిచిన టీమ్‌కు 8వేల నగదు, తృతీయ స్థానంలో నిలిచిన టీమ్‌కు 5వేల నగదుతో పాటు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నీరటి రాజుముదిరాజ్, చంద్రారెడ్డి,మోహన్‌నాయక్, యాదయ్య,అశోక్, ఎండీ గౌస్, షేగు అశోక్,జంగయ్య, సురేష్‌గౌడ్,కేతావత్ గణేష్, సాయిబాబా క్రీడకారులు పాల్గొన్నారు.–శంషాబాద్ రూరల్



## బక్రీద్‌కు..గొర్రెలు సిద్ధం

### ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుడా ఏర్పాట్లు

బక్రీద్ పండుగ వచ్చిందంటే చాలు నగరంలోని రోడ్లపై గొర్రెలు, మేకల అమ్మకాలు జోరుగా కనిపిస్తుంటాయి. ముస్లింలు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకునే పండుగలో బక్రీద్ ఒకటి. బక్రీద్ పండగను దృష్టిలో ఉంచుకుని ఓ వ్యాపారస్తుడు ఈ ప్రదేశంలో గొర్రెలను అమ్ముకునేందుకు వీలుకల్పిస్తున్నారు. ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలుగకుండా నగర్ శివారు ప్రాంతంలో షెడ్లను ఏర్పాటు చేశారు.ఈనెల 6న బక్రీద్ పండగ సందర్భంగా నగర శివారు ప్రాంతమైన బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని దర్గా ఖలీజ్‌ఖాన్‌లో షెడ్లు ఏర్పాటు చేసి గొర్రెలను విక్రయానికి ఉంచారు.రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన గొర్ల ఫాం రైతులు నేరుగా ఇక్కడకు తీసుకొచ్చి అమ్ముతున్నారు.
– బండ్లగూడ,జూన్ 3: